## బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



ఈద్గాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చందర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి

కామారెడ్డి, జూన్ 6 : త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను శనివారం జరుపుకొనేందుకు ముస్లింలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పట్టణంలోని తహసీల్ ఆఫీస్ వద్ద ఉన్న ఈద్గాతోపాటు చుట్టుపక్కల ఉన్న ఈద్గాలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. అదనపు కలెక్టర్ చందర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ ఈద్గాల వద్ద ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. పండుగ రోజు ఖుర్బానీ ఇవ్వడం ఆచారం కాగా మార్కెట్‌లో పొట్టేళ్లను కొనుగోలు చేస్తున్నారు. ఆవులను బలి ఇవ్వరాదని ఇప్పటికే ముస్లింలకు పోలీసు యంత్రాంగం సూచనలు చేశారు. ప్రముఖ ఈద్గాల వద్ద ప్రార్థనల కోసం మున్సిపల్ సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఎల్లారెడ్డిలో పరిసరాల పరిశుభ్రతపై స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 6 : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని 5, 6వ వార్డుల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం పర్యటించారు. ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఇంట్లో, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడం, సీజనల్ వ్యాధులు తదితర అంశాలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ గోవింద్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం

లింగంపేట, జూన్ 6 : లింగంపేట మండలం సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన చిన్నప్పగారి రుక్కవ్వ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత సోమవారం ఇంట్లో ఫోన్ ఉంచి ఇంటికి తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో బంధువులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



బీబీపేటలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్న డీఈవో రాజు



లింగంపేటలో ఉపాధ్యాయుల మానవహారం



కోమలంచలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ సాదుల సత్యనారాయణ

లింగంపేట/బాన్సువాడ రూరల్/నాగిరెడ్డిపేట/బీబీపేట్/ఎల్లారెడ్డి రూరల్/రామారెడ్డి/నిజాంసాగర్/బిచ్కుంద, జూన్ 6 : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లింగంపేట మండల కేంద్రంలో విద్యాశాఖ అధికారులు బడిబాట కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం నుంచి ర్యాలీని ప్రారంభించిన అధికారులు ప్రధాన రహదారి మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధానం రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాగిజావా, నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఎంఈవో షౌకత్‌అలీతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ సంఘం మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బాన్సువాడ మండలంలోని బోర్లం, దేశాయిపేట్, హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్, తాడ్కోల్, కొత్తాబాది, బుడ్మి, బోర్లం క్యాంపు, జక్కల్‌దాని తండా తదితర గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాటలో పాల్గొన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రచార కరపత్రాలను తహసీల్దార్ వరప్రసాద్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, పవన్‌చారి, గంగాధర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయులు, ఐకేపీ సంఘాల మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్‌పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంతాబాయి, ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆఫ్రిన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాణిక్యమ్మ, సీఆర్‌పీ రాజు, గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట్‌లో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో రాజు ప్రారంభించారు. రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలో బడిబాట నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు సీఆర్‌పీ మహమూద్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. బీబీపేట, దోమకొండ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బీబీపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో డీఈవో రాజు పదో తరగతి విద్యార్థులకు టెస్ట్ బుక్స్‌ను అందజేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో బడిబాట కార్యక్రమం ప్రారంభించినట్లు నిజాంసాగర్ ఎంఈవో తిరుపతిరెడ్డి తెలిపారు. నిజాంసాగర్ ప్రాథమిక పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి ప్రమీల ఒక జత యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సాదుల సత్యనారాయణ మొదటి బహుమతిగా రూ.వెయ్యి, రెండో బహుమతిగా ఇద్దరికి రూ.500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు భాస్కర్‌గౌడ్, రాజు, బాలరాజు, రమేశ్‌బాబు, ఐకేపీ ఏపీఎం రాంనారాయణ గౌడ్, సీఆర్పీలు శ్రీధర్‌కుమార్, నర్సింహులు, వరలక్ష్మి, మాజీ సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, బలరాంరెడ్డి, నాగభూషణం గౌడ్, పోతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. బిచ్కుంద మండలంలోని గుండెనెమ్లి గ్రామంలో నిర్వహించి బడి బాట కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, జూన్ 6 : మండలంలోని నల్లమడుగు గ్రామ ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు నెల్లూరి గంగారాం తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాల్లూమ్ సాయిలు, ఉపాధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా గులాంగారి సంజీవులు, సలహాదారులుగా శేఖర్, సంజీవులు, భాస్కర్, సాయిలును ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూపతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ సొసైటీలో అందుబాటులో ఎరువులు

నాగిరెడ్డిపేట, జూన్ 6 : మండలంలోని తాండూర్, కిచ్చన్నపేట సొసైటీలో పాస్పెట్, యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో సాయికిరణ్ తెలిపారు. 500 బస్తాల పాస్పెట్ (డీఏపీ), 800 బస్తాల యూరియా ఉందన్నారు. మాల్తుమ్మెద సొసైటీకి సోమవారం వరకు ఎరువులు రానున్నట్లు చెప్పారు.

# నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలి



యోగా చేస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

కామారెడ్డి, జూన్ 6 : అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యజీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని అన్నారు. శారీరక, మానసిక ప్రశాంతత కోసం యోగా సాధన తప్పనిసరని అన్నారు. ప్రస్తుతం కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆయుర్ చైతన్యం ఆయుర్వేద, పంచకర్మ వైద్యశాల ప్రొప్రైటర్ డాక్టర్ చైతన్య సురేశ్ సహకారంతో యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి, సహాధ్యక్షుడు చక్రధర్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ గణేశ్, జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్, వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, దేవయ్య, విజయ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ సస్పెన్షన్

కామారెడ్డి, జూన్ 6: విధులకు గైర్హాజరై మద్యం తాగి వాహనం నడిపిన నిజాంసాగర్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ రాకేశ్‌గౌడ్‌పై వేటు వేశారు. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న ఎలాంటి అనుమతిలేకుండా విధులకు గైర్హాజరుకావడం, మద్యం తాగి వాహనం నడపడంతో తాడ్వాయి పోలీసుస్టేషన్ పరిధిలో వాహనం ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు. పోలీసు ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు.

## సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభించిన ఏఎస్పీ చైతన్య, సీఐ సంపత్‌కుమార్

బీబీపేట్(దోమకొండ), జూన్ 6 : దోమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంచనూర్‌లో ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను ఏఎస్పీ చైతన్య, సీఐ సంపత్‌కుమార్ కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరా ఏర్పాటుకు ముందుకు వచ్చిన మనోహర్‌ను సన్మానించారు. గ్రామ యువత ఇలాంటి మంచి కార్యక్రమాల కోసం ముందుకువచ్చి పోలీసులకు సహకరించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై స్రవంతి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారికి వినతి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 6 : యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఎల్లారెడ్డి మండల పరిధిలో నిర్మించాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిలోని రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వాణికి శుక్రవారం వారు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సాయిబాబా, లింగమయ్య తదితరులున్నారు.

## ఫిర్యాదులను పరిష్కరించాలి

కామారెడ్డి, జూన్ 6 : విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈవేదిక ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వాటికి తగిన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్, డీఈ కళ్యాణ చక్రవర్తి, ఏడీఈ కిరణ్ చైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి ఒకరి ఆత్మహత్య

బీబీపేట్, జూన్ 6 : జీవితంపై విరక్తిచెంది గడ్డి మందు తాగి శుక్రవారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట మండలం ఇస్సానగర్ గ్రామానికి చెందిన సంగెపు స్వామి(45) ఆరు నెలల క్రితం ఇంటిని నిర్మించుకున్నాడు. దీనికోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక భార్య సంగెపు మణెమ్మతో ప్రతిరోజూ గొడవలు జరిగేవి. ఈ నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు మణెమ్మతో గొడవ పడి నేను చనిపోతానంటూ చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వ్యవసాయ భూమి వద్ద గడ్డి మందు తాగినట్లు కుంటుబ సభ్యులకు చెప్పడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో ఎల్లారెడ్డిపేట దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సంగెపు రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి




బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు

బాన్సువాడ/బిచ్కుంద, జూన్ 6 : పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఅండ్‌డీఎంఏ ఆదేశాల మేరకు పురపాలక సంఘం వంద రోజుల ప్రణళికలో భాగంగా ప్రభుత్వ ఏరియా దవాఖాన ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి శుక్రవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు పనులు చేపట్టే సమయంలో జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, టీబీ సూపర్‌వైజర్ శరత్, వైద్య పిబ్బంది పాల్గొన్నారు. బిచ్కుందలోని మున్సిపల్ పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది కోసం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం, డాక్టర్ రాకేశ్, వైద్య సిబ్బంది విజయ, నరేశ్, మొయిన్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, వీరేశం, సంజు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిజాంసాగర్/బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి రూరల్/ రామారెడ్డి (సదాశివనగర్)/బిచ్కుంద, జూన్ 6 : భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. పోడు భూముల గురించి తహసీల్దార్ భిక్షపతిని అడుగగా గ్రామంలో పోడుభూములు లేవని, ఫారెస్టు భూములు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ వరప్రసాద్ పాల్గొని రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో గిర్దవార్ అశోక్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలం శివ్వాపూర్, మల్లాయిపల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు గిర్దావర్ శ్రీనివాస్ తెలిపారు. సదాశివనగర్ మండలం దగ్గి గ్రామంలో ఏర్పాటు చేసిన భూ సమస్యల పరిష్కార వేదికను అదనపు కలెక్టర్ విక్టర్ సందర్శించారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈయనతోపాటు స్థానిక తహసీల్దార్ సత్యనారాయణ ఉన్నారు. బిచ్కుంద మండలంలోని గుండేనమ్లి, బండరెంజల్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గుండెనమ్లి గ్రామంలో నాయబ్ తహసీల్దార్ భరత్, బండరెంజల్ గ్రామంలో ఆర్ఐ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. కార్యక్రమంలో తహసీల్ కార్యాలయ సిబ్బంది కుషాల్, రాజశేఖర్, సాయాగౌడ్, మహేందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాలు పంపిణీ

పెద్దకొడప్‌గల్, జూన్ 6 : పెద్దకొడప్‌గల్‌లో శుక్రవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను మండల ప్రత్యేకాధికారి కిషన్, ఎంఈవో ప్రవీణ్‌కుమార్ పంపిణీ చేశారు. గ్రామాల్లో బాడిబాట కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

**వంద శాతం పుస్తకాలు సరఫరా..**

నాగిరెడ్డిపేట, జూన్ 6 : మండల విద్యావనరుల కేంద్రానికి ఈయేడు విద్యా సంవత్సరానికిగాను విద్యార్థులకు వంద శాతం పుస్తకాలు సరఫరా చేసినట్లు ఎంఈవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 11,846 జతల పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. ఎంఈవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కార్యాలయానికి వచ్చి పుస్తకాలను తీసుకువెళ్లాలన్నారు. ఏకరూప దుస్తువులు సిద్ధం చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రారంభం నాటికి అందిస్తామని తెలిపారు.



పెద్దకొడప్‌గల్‌లో పుస్తకాలను పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి కిషన్, ఎంఈవో ప్రవీణ్‌కుమార్

## రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

కామారెడ్డి, జూన్ 6 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణంలోని రాజీవనగర్ కాలనీలో ఒక ఇంటిలో ఉదయం అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కామారెడ్డి సీసీఎస్ టాస్క్‌ఫోర్స్ పోలీసు సిబ్బంది దాడిచేసి ఒక డీసీఎం వాహనాన్ని, అందులో ఉన్న దాదాపు 113 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి రవాణా చేస్తున్న వ్యక్తిని విచారించగా, తన పేరు షేక్ అర్బాజ్ అని చెప్పారు. డీసీఎం వాహనాన్ని కిరాయికి తీసుకొచ్చి జగిత్యాల పట్టణానికి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. సివిల్ సప్లయి అధికారులకు తెలియజేయగా వారు వచ్చి పీడీఎస్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. షేక్ అర్బజ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

## 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదిక

నిజాంసాగర్, జూన్ 6 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ప్రమీల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ తనిఖీ 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.3.4 కోట్ల పనులకు సంబంధించి గత నెల 22 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు గ్రామాల్లో తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ప్రమీల, పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్ కుమార్, అడిషనల్ డీఆర్డీవో వామన్‌రావు, ఎంపీడీవో గంగాధర్, ఎస్‌ఆర్పీ సాంబశివరావు, ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి(సదాశివనగర్), జూన్ 6 : సదాశివనగర్ మండలం మర్కల్ మల్లన్న గుట్ట వద్ద ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి బీఏ, బీకామ్, బీఎస్సీ ఇంగ్లిష్ మీడియం మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తునకు పదో తరగతి, ఇంటర్ మార్కుల మెమో, జనవరి 01–2025 తహసీల్దార్ ద్వారా పొందిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఐదు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు జత చేసి ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో అందజేయాలని తెలిపారు.

## రూ.48 లక్షలతో అభివృద్ధి పనులు

నాగిరెడ్డిపేట, జూన్ 6 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో రూ.48 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడ్తున్నట్లు ప్రత్యేకాధికారిణి గీత తెలిపారు. పాఠశాలలో గదుల కొరత ఉండడంతో మూడు కొత్త గదుల నిర్మాణం, సీసీ రోడ్డు, డ్రైనేజీ, మినరల్ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా అందక పోవడంతో.. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలకు రంగులు వేస్తున్నట్లు చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు ఆమె తెలిపారు.

## 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'పై అవగాహన

పెద్దకొడప్‌గల్(పిట్లం), జూన్ 6 : పిట్లం మండలంలోని గోద్మెగాం గ్రామంలో అమ్మమాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు అపర్ణ, సంగమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు ఎంపిక

లింగంపేట/రామారెడ్డి (సదాశివనగర్)/ఎల్లారెడ్డి రూరల్/నిజాంసాగర్, జూన్ 6 : లింగంపేట మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి షౌకత్ అలీ తెలిపారు. లింగంపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన శ్రవణ్, లింగంపేట బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సౌమ్య, భవానీ, మోతె ఉన్నత పాఠశాలకు చెందిన అఖిలేశ్, లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ప్రతీక్‌గౌడ్ ఎంపికైనట్లు తెలిపారు. గత సంవత్సరం నవంబర్‌లో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున ఇంటర్ విద్య పూర్తి చేసే వరకు స్కాలర్‌షిప్ పొందనున్నట్లు ఆయన తెలిపారు. సదాశివనగర్‌లోని మాడల్‌స్కూల్ విద్యార్థులు 11 మంది స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిలోని జడ్పీపీహెచ్‌ఎస్ (బాలికల) పాఠశాల విద్యార్థిని అన్షర మహవీన్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైంది. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు లింగమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు. మహ్మద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శృతి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, ఎంఈవో అమర్‌సింగ్ తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



నిజాంసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో యోగా ఆవశ్యకతను వివరిస్తున్న యునానీ మెడికల్ ఆఫీసర్ నాథ్

నిజాంసాగర్, జూన్ 6 : మండలంలో ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని యునానీ మెడికల్ ఆఫీసర్ నాథ్ కోరారు. శుక్రవారం నిజాంసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు అరుణ, బీర్‌సింగ్, జీపీ కార్యదర్శి భీమ్‌రావు, గ్రామ పెద్దలు మేకల నరేశ్, రాము రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

14 నమస్తే తెలంగాణ దినపత్రికకు 14వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



శ్రీ ప్రభాకర్ గారు
ఎం.పి.డి.ఓ, నాగిరెడ్డిపేట్

తెలంగాణ ఉద్యమ సమయంలో ఆవిర్భవించి
రాష్ట్ర సాధనలో తనవంతు పాత్ర పోషించి
అనతి కాలంలోనే పాఠకుల ఆదరణ పొంది
14వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
నమస్తే తెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి
వార్షికోత్సవ శుభాకాంక్షలు....

ఎం.ప్రకాశ్ సీనియర్ అసిస్టెంట్ | ఎ.అరుణ్‌కుమార్ జూనియర్ అసిస్టెంట్ | జె.విఠల్ టైపిస్ట్

మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది - నాగిరెడ్డిపేట్, కామారెడ్డి జిల్లా

## గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ



మెంగారంలో దుర్గమ్మకు బోనాలు సమర్పించడానికి తరలివెళ్తున్న యాదవులు

లింగంపేట(తాడ్వాయి)/లింగంపేట, జూన్ 6 : తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. గ్రామ శివారులోని గ్రామ దేవతల ఆలయాల్లో బోనాలు సమర్పించి పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. లింగంపేట మండలం మెంగారం గ్రామంలో బోనాల పండుగను నిర్వహించారు. గ్రామానికి చెందిన యాదవులు దుర్గమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల మధ్య ఉన్న దుర్గమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.